మత్తు మందు చల్లారు.. మేకలను ఎత్తుకెళ్లారు!

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని వీవర్స్‌గుడి సమీపంలో ఓ గొర్రెల దొడ్డిలో ఉన్న 30 మేకలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున అపహరించుకుపోయారు. కేమిడి లక్ష్మయ్య మేకలను రోజూ మాదిరిగానే రాత్రిళ్లు దొడ్డిలోకి పంపించారు. 30 మేకలకు సంబంధించిన పిల్లలను అక్కడే వదిలేసి తల్లి మేకలను దుండగులు అపహరించుకుపోయినట్లు బాధితుడు లక్ష్మయ్య తెలిపారు. దొంగిలించే క్రమంలో దుండగులు జీవాలకు మత్తు పదార్థం కలిపిన స్ప్రేను చల్లారని, దాంతో అవి తీవ్ర మత్తులోకి వెళ్లి అరవలేదని చెప్పారు. అపహరణకు గురైన జీవాల రూ.4లక్షలు ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం నాయకులు జాయ మల్లేశం, మేకల రాంప్రసాద్, తదితరులు పరామర్శించారు.

'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..
ఏమేమి కాయొప్పునే గౌరమ్మ..
చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మ..
ఒక్కేసి పువ్వేసి సందమామ.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. మమ్మేలు కోయమ్మ ఉయ్యాలో..
అంటూ ఊరువాడా వ్యాప్తంగా బతుకమ్మ పాటలు మారుమోగుతున్నాయి..

జగమేలుతోంది.. మన బతుకమ్మ

నేడు సద్దుల బతుకమ్మ

ఎన్నో ప్రత్యేకతలు.. సంప్రదాయాల మేళవింపు

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి, న్యూస్‌టుడే, నర్సంపేట, దేవరుప్పుల(జనగామ)

ఇంద్రధనస్సులోని వర్ణాలు కలిగిన తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మ నేడు జగమేలుతోంది.. తెలంగాణ సంస్కృతికి పూల పండగ నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.. మన సంప్రదాయాన్ని విదేశాల్లోనూ వ్యాప్తి చేస్తున్నారు.అక్కడ స్థిరపడ్డ మనవాళ్లు అంగరంగ వైభవంగా జరుపుకొంటున్నారు..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ పండగను నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..



16 ఏళ్లుగా ఒక్కో అడుగు పెంచుతూ..

నర్సంపేటకు చెందిన రుద్రారపు సరోజన-వైద్యుల దంపతులు తొమ్మిది రకాల పూలతో ఏటా ఒక అడుగు పెంచుతూ పెద్ద బతుకమ్మను పేరుస్తున్నారు. 16 ఏళ్ల కిందట తొలిసారి 3 అడుగుల ఎత్తులో బతుకమ్మను పేర్చారు. అప్పటి నుంచి ఏటా ఒక్కో అడుగు ఎత్తు పెంచుతూ వస్తున్నారు. ఈసారి 12 అడుగుల ఎత్తుతో బతుకమ్మను పేర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజులుగా పలువురు కూలీలతో పెట్టి కొత్తగూడ, గంగారం, పాకాల అడవుల్లో గునుగు, తంగేడు, టేకు, అల్లి పూలు, తామర, సీతజడ, బంతి, చామంతి వంటి 9 రకాల పూలను సేకరిస్తున్నారు. ఇంట్లో మహిళా కూలీలతో వాటిని కట్టలు కట్టిస్తున్నారు. ప్రత్యేక ట్రాలీలో బతుకమ్మను మైదానానికి భాజాభజంత్రీల నడుమ తీసుకొస్తారు.



కన్నడీలకు మక్కువ..

బతుకమ్మ పండగను కన్నడ ప్రజలు బాగా ఇష్టపడుతున్నారు. కర్ణాటకలోని హసన్ జిల్లా హళబిడ గ్రామానికి చెందిన అయ్యంగార్ యమున-రాజు దంపతులు పదేళ్ల కిందట నర్సంపేటకు వచ్చి బేకరి నడుపుతున్నారు. ఇక్కడి ప్రజలు పూలను ఆరాధించే సంస్కృతి వారికి బాగా నచ్చింది. సొంతంగా బతుకమ్మ పేర్చి ఇక్కడి మహిళలతో కలిసి ఆడుతున్నారు.

సీతంపేటలో దీపావళికి వేడుకలు.. పురుషులూ ఆడుతారు..



భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం సీతంపేటలో నేతకాని కులస్థులు దీపావళి పండగ సమయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. గ్రామస్థులు తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగిస్తున్నారు. దీపావళి రోజున పుట్టమన్ను తీసుకొచ్చి ఇళ్లలో జోడెడ్ల ప్రతిమలను తయారు చేసి పూజిస్తారు. మరుసటి రోజున కేధారేశ్వర వ్రతం చేస్తారు. జోడెడ్లను అలంకరించి ఊరేగిస్తారు. తర్వాత చెరువులో నిమజ్జనం చేస్తారు. మరుసటి రోజున సద్దుల బతుకమ్మను నిర్వహిస్తారు. మహిళలతో పాటు, పురుషులు కూడా బతుకమ్మ ఆడుతారు.

విదేశాల్లోనూ సందడే..

ఒకప్పుడు తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోనే సందడి చేసిన బతుకమ్మ పండగ నేడు విశ్వవ్యాప్తమైంది. యూకేలోని వారిక్ పట్టణంలో జరిగే వేడుకలు ఉత్తరాది దక్షిణాది సంస్కృతుల మేళవింపుగా సాగుతున్నాయని తెలుగు ఆడపడుచు, అక్కడి కౌన్సిలర్ ఎల్లాప్రగడ హేమ తెలిపారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకోవడం విదేశీ మహిళలు ఆసక్తిగా గమనించి.. తమతో కలిసి వస్తున్నారని తెలుగు మహిళలు చెబుతున్నారు.


టోక్యో నగరంలో..



ముందస్తు అనుమతి తీసుకుంటాం..



- తాటిపాటి పల్లవీ-సాగర్, కోటోకు ఓజీమా వీధి, టోక్యో (దేవరుప్పుల మండలం సీతారాంపురం)

మా వీధిలో 60 వరకు తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మ పండగను అందరం కలిసి జరుపుకొంటాం. సామూహికంగా నిర్వహించాలి కాబట్టి అధికారుల ముందస్తు అనుమతి తీసుకుంటాం. గడ్డిపూలు, వివిధ రాకల పూలతో బతుకమ్మ పేర్చి, ఒక దగ్గర గుమిగూడి ఆటపాటలతో సందడి చేసి, వాయినాలు ఇచ్చుకుంటాం. సమీపంలోని నదిలో నిమజ్జనం చేస్తాం.

వంటకాలను ఇచ్చిపుచ్చుకుంటాం..



- పెద్దాపురం మమత, అల్బనీ, అమెరికా, (దేవరుప్పుల)

అల్బనీ ప్రాంతంలో బతుకమ్మకు ప్రత్యేకంగా పూలు తెచ్చి మార్కెట్‌లో అమ్ముతుంటారు. ఇక్కడ తెలుగు సహా ఇతర రాష్ట్రాల మహిళలు కలిసి వేడుకలు జరుపుకొంటారు. సద్దుల బతుకమ్మ నాడు వండిన వంటకాలను ఒకరికొకరం పంచుకుంటాం.

ఇంట్లోనే నిమజ్జనం..



- గాదె ఉషశ్రీ, చెక్ రిపబ్లిక్, (దేవరుప్పుల)

మేము ఉండే దగ్గర 25-30 తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మను ఎవరి నివాసంలో వారే నిర్వహించి, అష్టమి రోజు ఒక నీటి తొట్టి ఏర్పాటు చేసుకొని నిమజ్జనం చేస్తాం. వీలును బట్టి అందరి ఇళ్లు కలియతిరిగి శుభాకాంక్షలు చెప్పుకొంటాం.

● కెనడా రాజధాని అటవా నగరంలో వరంగల్ జిల్లాకు చెందిన పలు అనేక కుటుంబాలు స్థిరపడ్డాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి మండలం దండేపల్లికి చెందిన సుధీర్ కోదాటి ఈ ప్రాంతంలోని తెలుగువారిని సంఘటితం చేసి గత 15 ఏళ్లుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. తెలుగు అసోసియేషన్ నిర్వహించే బతుకమ్మ వేడుకలకు బంగారు నాణేలు, 500 డాలర్లు బహుమతులుగా ఇస్తున్నారు. 19 ఏళ్ల కింద అమెరికాలోని షికాగాలో స్థిరపడిన వర్ధన్నపేటకు చెందిన పూర్ణచందర్ అల్లమనేని 2003 నుంచి ఘనంగా సంబరాలు జరుపుతున్నారు.

మార్కెట్ల పాలకవర్గం నియామకం


జనగామ మార్కెట్ కమిటీ అధ్యక్షుడుగా బనుక శివరాజ్‌యాదవ్

జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పరిధిలోని రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తరువులు వెలువరించింది. పాలకవర్గం రెండేళ్ల వ్యవధితో మార్చి 2023లో ఏర్పాటైంది. ప్రభుత్వ మార్పుతో ఏడాదిలోపే ఆ కార్యవర్గం రద్దయిన సంగతి తెల్సిందే. కమిటీలో చైర్‌పర్సన్ సహా 14 మంది వివిధ వర్గాల ప్రతినిధులు, నలుగురు ప్రత్యేక(ఎక్స్ అఫీషియో) సభ్యులు మొత్తం 18 మంది ఉంటారు.

● జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా బనుక శివరాజు, ఉపాధ్యక్షుడు కొల్లూరు నర్సింలు, సభ్యులు నియమితులయ్యారు. వీరితో పాటు పీఏసీఎస్ నిడిగొండ అధ్యక్షుడు, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, జనగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రత్యేక ఆహ్వానిత సభ్యులుగా ఉంటారు.

● స్టే.ఘన్‌పూర్ అధ్యక్షురాలిగా జూలుకుంట్ల లావణ్య, ఉపాధ్యక్షుడు నూకల ఐలయ్య, సభ్యులు నియామకమయ్యారు. ప్రత్యేక ఆహ్వానిత సభ్యులు.. పీఏసీఎస్ స్టే.ఘన్‌పూర్ ఛైర్మన్, డీఎంవో, ఏడీఏ స్టే.ఘన్‌పూర్, శివునిపల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ఉంటారు.


స్టేషన్‌ఘన్‌పూర్ కమిటీ అధ్యక్షురాలిగా జూలుకుంట్ల లావణ్య

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్‌లతో కలిసి కలెక్టర్ రిజ్వాన్‌బాషా జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ.. ప్రకృతికే అందం బతుకమ్మ అని, సంబరాల్లో కలెక్టరేట్‌కు కొత్త శోభ వచ్చిందని అన్నారు. అందంగా పేర్చిన వాటిని తిలకించి, వారిని అభినందించారు. అనంతరం కలెక్టర్ దంపతులు ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. చక్కగా బతుకమ్మలను పేర్చిన డీఆర్డీఏ శాఖకు మొదటి బహుమతి, యూపీహెచ్‌సీ ద్వితీయ, డీపీవో శాఖ తృతీయ బహుమతి గెలుచుకుంది. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మొదటి బహుమతి గెలుచుకున్న డీఆర్డీఏ శాఖకు సంబంధించిన బతుకమ్మ


వేడుకల్లో కలెక్టర్ దంపతులు, ఉద్యోగినులు


డీసీపీ కార్యాలయంలో మహిళలు, చిత్రంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారధి, తదితరులు

స్ఫూర్తిదాయకం.. వీరి విజయపథం



కలలు కనడమే కాదు, వాటిని నిజం చేసుకోవడం ముఖ్యం. జీవితానికి ఓ లక్ష్యం ఏర్పరచుకుని, అందుకు తగిన కార్యాచరణ, దాన్ని అమలు చేయాలనే చిత్తశుద్ధి, సంకల్పబలం ఉండాలి. తరగతి గదిలో దేశ భవిష్యత్తును నిర్మించే ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనే సదాశయంతో రేయింబవళ్లు శ్రమించి, అనుకున్నది సాధించారు. విజయానికి దగ్గరి దారులు లేవని, శ్రమకు ప్రత్యామ్నాయం లేదని రుజువు చేసి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ఈ ఫలితాల్లో ఎక్కువగా అన్నాచెల్లెల్లు, అన్నదమ్ముళ్లు, అక్కాచెల్లెల్లు, భార్యభర్తలు ఉద్యోగాలకు ఎంపిక కావడం గమనార్హం. ఒక్కొక్కరిదీ ఒక్కో స్ఫూర్తిదాయక యత్నం.. ఈ విజయం..

– న్యూస్‌టుడే, జనగామ

అన్నా చెల్లెలు..


కుందారపు సిద్దిలింగం


కృష్ణవేణి

బచ్చన్నపేట మండలం కొన్నెకు చెందిన చేనేత కార్మికుడు కుందారపు యాదగిరి చంద్రకళ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు ఉపాధ్యాయుడు. ప్రస్తుత డీఎస్సీలో రెండో కుమారుడు సిద్దిలింగం, కుమార్తె కృష్ణవేణిలు ఎస్జీటీ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారు. కృష్ణవేణి ఇంటర్ తర్వాత ఎస్జీటీ, ఆపైన ఎంఎస్సీ వరకు చదివారు. భర్త ప్రోత్సాహం, సోదరుడి సహకారంతో డీఎస్సీలో 62వ రాంకు సాధించింది. సోదరుడు సిద్దిలింగం 4వ రాంకు పొందడం విశేషం.

స్కూల్అసిస్టెంట్, ఎస్జీటీ రెండిట్లోనూ..


ధరావత్ రూప్‌సింగ్

నర్మెట్ట మండలం రత్నాల తండాకు చెందిన ధరవాత్ మంజ్యా-లలిత పెద్ద కుమారుడు రూప్‌సింగ్ ఇంటర్ తర్వాత డీఎడ్, ఆ తర్వాత అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ నుంచి బీఏ, ఆపైన బీఎడ్, ఎంఎడ్ చేశాడు. ఆపైన కేయూలో ఎంఏ పూర్తి చేసి చరిత్ర టూరిజం మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ చేస్తు, డీఎస్సీకి హాజరయ్యాడు. ఎస్జీటీలో 41, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 28వ రాంకు సాధించాడు. ఎస్జీటీ వదులుకుని స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయుడు కావాలనే లక్ష్యాన్ని సాధించాడు.

కార్మికుడిగా పనిచేస్తూనే..


బండ కృష్ణ

జనగామ సంజయ్‌నగర్‌కు చెందిన బండ ఐలయ్య అండాలు దంపతులకు ముగ్గురు కుమారులు. ఐలయ్య సహా ఇంట్లో అందరు కార్మికులే. ఈయన మూడో కుమారుడు కృష్ణకు ఉపాధ్యాయుడు కావాలనేది జీవితాశయం. జనగాలో బీఎడ్ చేస్తూనే కుటుంబానికి అండగా నిలబడేందుకు ఇద్దరు అన్నలతో పాటు భవన నిర్మాణ రంగ కార్మికుడయ్యాడు. టైల్స్ వేసే వృత్తిలో కొనసాగుతూ డీఎస్సీకి హాజరై బీసీ కేటగిరీలో మొదటి ర్యాంకు, ఓపెన్లో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 6వ రాంకుతో ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

కష్టాలు అధిగమించి.. నాలుగు ఉద్యోగాలు సాధించి..


మౌనిక

జనగామ టౌన్: హాయిగా సాగిపోతున్న జీవితంలో తండ్రి మరణంతో ఆ కుటుంబంలో చీకట్లు కమ్మాయి. జనగామకు చెందిన ఉల్లెంగుల పాపయ్య-మంగమ్మ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. పెద్దకుమార్తె పేరు మోనిక. ఇద్దరి చెల్లెల్లో ఒకరు దివ్యాంగురాలు. తల్లి ఇళ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మోనిక ఎంఏ ఆంగ్లం పూర్తి చేసింది. తొలుత కేజీబీవీలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించింది. ఇటీవలనే గురుకుల పాఠశాలలో టీజీటీగా ఎంపికై ఉద్యోగం చేస్తోంది. తాజా డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్) పోస్టుతో పాటు ఎస్జీటీ పోస్టు కూడా దక్కించుకుంది.

మిత్రులు.. పీఈటీలుగా..


సోమనర్సయ్య, శ్రీధర్

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్‌కు చెందిన ఇద్దరు చిన్ననాటి మిత్రులు క్రీడలపై మక్కువతో వ్యాయమ క్రీడలపై ఆసక్తి పెంచుకొని పీఈటీ పోస్టులకు ఎంపికయ్యారు. జఫర్‌గఢ్‌కు చెందిన సముద్రాల సోమనర్సయ్య, వడ్డెగూడెంకు చెందిన శిరంశెట్టి శ్రీధర్‌లు బడి నుంచి డిగ్రీ వరకు కలిసే చదువుకున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పీఈటీలుగా పనిచేస్తున్నారు. డీఎస్సీలో పీఈటీలుగా ఎంపిక కావడం పట్ల వారితో చదువుకున్న స్నేహితులు అభినందిస్తున్నారు.

అమ్మే.. చూపుగా మారి..


తల్లి కల్పనాదేవితో మన్విత

జనగామ జ్యోతినగర్‌కు చెందిన కల్పనాదేవి కుమార్తె లిక్కి మన్వితకు పుట్టుకతోనే చూపులేదు. చదువే ఆమె భవితకు చూపుగా ఉంటుందని భావించి కుమార్తెను హైదరాబాద్‌లో ప్రత్యేక పాఠశాలలో చేర్పించింది. ప్రత్యేక విద్యలో డిగ్రీ, బీఎడ్ చేసింది. మన్వితకు గైడ్‌గా మారి డీఎడ్ చేయించారు. ప్రత్యేక పాఠశాలల్లో పోస్టుల కోసం ఈ డీఎస్సీలో ఎస్జీటీ విభాగంలో మన్విత 9వ రాంకు సాధించి కొలువు సాధించింది. పుట్టుకతో ప్రత్యేక వైకల్యం కలిగిన తన కుమార్తెకు ఓ దారి చూపించాలనే లక్ష్యం నెరవేరిందని కల్పనాదేవి హర్షం వ్యక్తం చేశారు.

నాడు పేపర్‌బాయ్.. నేడు ఉపాధ్యాయుడు


సత్యనారాయణ

లింగాలఘనపురం: మండలంలోని మాణిక్యపురం గ్రామానికి చెందిన గంట శాంతమ్మ-నర్సయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కొడుకు సత్యనారాయణ పదేళ్ల పాటు పేపర్‌బాయ్‌గా పని చేస్తూ వచ్చిన డబ్బులతో పుస్తకాలు, నోటు పుస్తకాలు కొనుక్కొని ఫీజులు కట్టుకునేవాడు. టీటీసీ పూర్తి చేసి ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పోటీ పరీక్షలు రాశాడు. తాజా ఫలితాల్లో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. పేదరికాన్ని జయించడం ఆనందంగా ఉందంటూ అభిప్రాయాలను పంచుకున్నారు.

బచ్చన్నపేటలో అన్నా చెల్లెలు


మహేశ్‌కుమార్, మౌనిక

బచ్చన్నపేట: బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన బల్ల సోమయ్య-పద్మ దంపతులకు కుమారుడు మహేశ్, కుమార్తె మోనికలు. తండ్రి 18 ఏళ్ల క్రితం చనిపోయారు.. తల్లి బీడీలు చుట్టి పిల్లలను చదివించింది. తల్లి పడుతున్న కష్టాన్ని చూసిన ఆ అన్నాచెల్లెలు కుటుంబాన్ని మంచి స్థాయికి తీసుకురావాలని సంకల్పించారు. కష్టపడి చదివి ఎస్జీటీ విభాగంలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ఆఫీస్ సబార్డినేట్ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా



జనగామ అర్బన్: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న జనగామ పట్టణంలోని గోకుల్‌నగర్‌కు చెందిన వరప్రసాద్ అంధత్వాన్ని జయించి స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. తాను పనిచేస్తున్న కార్యాలయంలోని అధికారుల్లాగా తాను ఉన్నత ఉద్యోగం సాధించాలనే సంకల్పాన్ని పెట్టుకున్నాడు. టెట్‌లో అర్హత సాధించడంతో డీఎస్సీకి సన్నద్ధమయ్యాడు. అటు ఉద్యోగం చేస్తూనే మరోవైపు డీఎస్సీ లక్ష్యంగా ప్రణాళికతో చదివాడు. ఎస్ఏ-సోషల్ స్టడీస్ విభాగంలో ఉత్తమ మార్కులు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

భర్తల స్ఫూర్తితో భార్యలు..


భర్తలతో వీణ, విద్యావతి

పాలకుర్తి: పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన అక్కాచెల్లెళ్లు శేర్ల వీణ, విద్యావతిలు బీఏ డీఈడీ పూర్తి చేసి డీఎస్సీలో కొలువులు సాధించారు. వీణ భర్త సురేశ్, విద్యావతి భర్త రమేశ్‌లు 14 ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉన్నారు. వారి ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారంతో ఫలితాల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యామని అక్కాచెల్లెళ్లు తెలిపారు.

దంపతులకు టీచర్ల కొలువు


బీంరెడ్డి రవీందర్‌రెడ్డి, స్రవంతి

తరిగొప్పుల: తరిగొప్పులకు చెందిన బీంరెడ్డి రవీందర్‌రెడ్డి-స్రవంతి దంపతులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. భర్త 2018 డీఎస్సీ ఫలితాల్లో అర్హత సాధించినా, అనివార్య కారణాలతో పెండింగ్‌లో ఉంది. ఇటీవల హైకోర్టు వెలువడించిన తీర్పులో వారికి మద్దతుగా వచ్చాయి. మరో 20 రోజుల్లో నియామకం ఉంటుంది. ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే భార్య 2024 ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగానికి ఎంపికయ్యారు.

> ప్రస్తుతం మడికొండలోని మెట్టుగుట్ట సీతారామాంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన 240 ఎకరాల దేవాదాయశాఖ భూములు ఉన్నాయి. ఇందులో 160 ఎకరాలు రైల్వేకు ఇచ్చారు. మిగిలిన స్థలం కూడా కోచ్‌ల నిర్మాణానికి కేంద్రం సేకరించే అవకాశాలున్నాయి.

వందేభారత్ తయారీ ఇక్కడే!

- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కల సాకారం..
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటనతో ఆనందం
- అదనంగా రూ.66 కోట్లు మంజూరు



ఓరుగల్లు ప్రజల చిరకాల వాంఛ నెరవేరే రోజు వచ్చింది. గత 45 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో కాజీపేటలో కోచ్‌లు తయారు చేస్తామని ప్రకటించడం ఆశలు రేపాయి. రైల్వే జంక్షన్ కాజీపేటలోని అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న వ్యాగన్ తయారీ కేంద్రాన్నే అప్‌గ్రేడ్ చేసి కోచ్‌లు తయారు చేయాలని కేంద్రం భావిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎక్కువ డిమాండ్ ఉన్న వందే భారత్ రైలు కోచ్‌లు ఇక్కడ తయారు చేయాలని నిర్ణయించడం కాజీపేటకు గొప్ప మలుపు కాబోతోంది.

కాజీపేట, న్యూస్‌టుడే

ఒక్కో అడుగు పడుతూ..

వరంగల్ ప్రజల నాలుగు దశాబ్దాల ఉద్యమ ఫలితమే కోచ్ ఫ్యాక్టరీ. 1980 దశకంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం సైతం మంజూరు చేసింది. డీజిల్ షెడ్ పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. పంజాబ్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ పరిశ్రమలు నెలకొల్పి యువతను ఆకట్టుకోవాలనే ఆలోచనతో కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని కపుర్తాలకు మార్చారు. అప్పటి నుంచి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. 2010లో వ్యాగన్ మరమ్మతుల వర్క్‌షాపు, వ్యాగన్ తయారీ కేంద్రాన్ని సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అక్కడ స్థలం లేకపోవడంతో కాజీపేటకు తరలించారు. ఇక్కడా స్థల సేకరణలో ఆలస్యమైంది. చివరికి 2016లో వ్యాగన్ షెడ్ కోసం నిధులు కేటాయించారు. ఎట్టకేలకు 2023లో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపు పనులను ప్రారంభించారు. స్థానికులు దీనిపై అసంతృప్తిగా ఉండటంతో వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపుతో పాటు పిరియాడికల్ ఓవరాహాలింగ్ కేంద్రాన్ని సైతం మంజూరు చేశారు. కోచ్ మీద ఉన్న ఆశ అలాగే ఉంది. స్థానిక రైల్వే ఐకాస ఆధ్వర్యంలో కోచ్ సాధన సమితి పేరు మీద ఆందోళన చేశారు. చివరకు దేశవ్యాప్తంగా వందేభారత్ రైలు కోచ్‌లకు డిమాండ్ ఉండటంతో వ్యాగన్ తయారీ పరిశ్రమను, పీఓహెచ్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అభివృద్ధి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.



నిర్మాణంలో భారీ షెడ్



సిద్ధంగా క్రేన్‌లు

అడ్డంకులు లేకుండా ఉన్న స్థలంలోనే..

కోచ్ ఫ్యాక్టరీకి మరింత స్థలం అవసరం. సేకరణకు సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి 160 ఎకరాలను సేకరించి వ్యాగన్ పరిశ్రమను నెలకొల్పుతున్నారు. రెండు ప్రధాన షెడ్ల నిర్మాణం, కార్యాలయాల భవనాలు నిర్మిస్తున్నారు.. దీనికి అదనంగా మరో షెడ్‌ను నిర్మించడానికి రూ.66 కోట్లను కేంద్రం విడుదల చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న 160 ఎకరాల్లోనే కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తారు. ప్రస్తుతం ఉన్న స్థలాన్ని పూర్తి సామర్థ్యం మేరకు వినియోగించుకోవాలని చూస్తున్నారు.. రాబోయే రోజుల్లో అదనపు స్థలం సేకరించి మరింత విస్తరిస్తారు.

చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో

చెన్నై పెరంబూరులో గల ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో ఇక్కడ నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ వందే భారత్ కోచ్‌లు తయారవుతున్నాయి. దీనికి అదనంగా ఇప్పుడు కాజీపేటలో ప్రారంభం అవుతాయి.



రైల్వే వ్యాగన్‌ల తయారీ కేంద్రం షెడ్



వ్యాగన్ పరిశ్రమ కార్యాలయం

3000 మంది సిబ్బంది..

కోచ్ ఫ్యాక్టరీకి 3000 మంది సిబ్బంది అదనంగా రానున్నారు. పీఓహెచ్, వ్యాగన్ పరిశ్రమలకు 2000 మంది అవసరం అవుతారు. రెండు పరిశ్రమలకు కలిపి మొత్తం 5000 మంది కార్మికులు వచ్చే అవకాశం ఉంది. ముందుగా వందేభారత్ రైళ్ల కోచ్‌ల తయారీపైనే దృష్టి పెడుతున్నారు. షెడ్ నిర్మాణం కాగానే తయారీ యంత్రాలను అమరుస్తారు. పెరంబూరు కోచ్ ఫ్యాక్టరీలో పనిచేసే నిపుణులను రప్పించి ఇక్కడి కార్మికులు, అధికారులకు శిక్షణ ఇస్తారు. కోచ్‌ఫ్యాక్టరీ పూర్తి స్థాయిలో పనిచేస్తే రాంపూర్, కాజీపేట ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. అనుబంధ పరిశ్రమలు వస్తాయి.

అంకెల్లో వివరాలు..
- కోచ్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వ గతిశక్తి పథకం కింద ఏర్పాటు చేస్తోంది.
- వ్యాగన్ షెడ్ కాజీపేటలో ప్రతిపాదించిన సంవత్సరం- 2013
- కేటాయించిన నిధులు రూ.521 కోట్లు
- మొదటి దశలో విడుదలైనవి రూ.220 కోట్లు
- వ్యాగన్ తయారీ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసింది: 2023
- పీఓహెచ్‌గా అప్‌గ్రేడ్ అయింది: 2023
- కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యేది: 2025-26

పడిలేచిన కెరటం..

తపాలా సేవలు ఆదర్శం



ఒకప్పుడు ఇంటి ముందు పోస్ట్.. అన్నమాట వినపడగానే ఇంట్లో అందరి ముఖాల్లో సంతోషం వెల్లివిరిసేది. దూరాన ఉన్న బంధువుల యోగక్షేమాలను అది మోసుకొచ్చేది. మన క్షేమ సమాచారం తీసుకెళ్లేది. ఇంటింటిని పలకరించే ఆత్మీయ బంధువులా తపాలాశాఖ ఉండేది. సమాచార సాంకేతిక పరిజ్ఞానం పెరిగి అంతర్జాలం, చరవాణులు అందుబాటులోకి వచ్చాక ఉత్తర ప్రత్యుత్తరాలు కనుమరుగయ్యాయి. మనియార్డర్లు పంపేవారు లేరు. తపాలాశాఖ ప్రాభవం కోల్పోయే పరిస్థితి నుంచి మళ్లీ కోలుకుంది. వినూత్న సేవలతో ప్రజాదరణ పొందుతోంది. గురువారం జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. – న్యూస్‌టుడే, శివనగర్

గ్రామస్థాయిలో పటిష్ఠ సమాచార, మానవ వనరులతో కూడిన వ్యవస్థ ఒక్క తపాలాశాఖకే సొంతం. వర్షం కురిసినా.. వరదలు పొంగినా తోకలేని పిట్ట తొంభై మైళ్లు వెళ్తుంది. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సమాచార సాంకేతిక వ్యవస్థ తోడుతో తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. సేవలను అందించడంలో వేగం పెరిగింది. సాధారణ సేవలతో పాటు పొదుపు, బీమా, బ్యాంకింగ్ రంగంలోనూ అడుగిడింది.

అందిస్తున్న సేవలు..

సాధారణ తపాలా సేవలతో పాటు స్పీడ్‌పోస్టు, క్యాష్ ఆన్ డెలివరి (సీవోడీ), ఎలక్ట్రానిక్ మనీ ట్రాన్స్‌ఫర్, ఆధార్ అప్‌డేట్ (సవరణ), తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనం టికెట్లు, మైస్టాంప్, వెస్టర్న్ మనీ ట్రాన్స్‌ఫర్. ● పొదుపు ఖాతాలు, రికరింగ్ డిపాజిట్లు, కిసాన్ వికాస పత్రాలు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్, సుకన్య సమృద్ధి యోజన ఖాతా, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్, పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్, నెలవారీ ఆదాయ పథకం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు, 1 నుంచి 5 ఏళ్ల టైమ్ డిపాజిట్ ఖాతాలు, తపాలా బ్యాంకు, ఏటీఎం.



మీసేవ తరహాలో..

విమాన, బస్సు, రైలు టికెట్ల రిజర్వేషన్, అన్ని రకాల బీమా పథకాలు, ఇంటి, నల్లా పన్నులు, గ్యాస్ బిల్లులు, ఈఎంఐ చెల్లింపులు, ఫాస్టాట్యాగ్, ఐటీ రిటర్న్స్, సెల్‌ఫోన్ సిమ్‌కార్డు రీఛార్జి, పాన్‌కార్డు, పాస్‌పోర్టుకు దరఖాస్తులు, పీఎం ఫసల్ బీమా, పీఎం జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి శ్రమయోగి మన్‌ధన్ యోజన (పీఎం-ఎస్‌వైఎం), ప్రధాన మంత్రి లఘు వ్యాపారి మన్-ధన్ యోజన (పీఎం-ఎల్‌వీఎం), ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వనిధి), నేషనల్ పెన్షన్ సిస్టం, జీవన్ ప్రమాణ్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) జారీకి దరఖాస్తు, ఇ-డిస్ట్రిక్ట్ సేవలు.



వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయంలో సేవలందుకుంటున్న వినియోగదారులు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఇలా.. వరంగల్, హనుమకొండ డివిజన్ల పరిధిలో ఐదు ప్రధాన, 90 సబ్ యూనిట్, గ్రామస్థాయిలో 679 తపాలా కార్యాలయాలు పనిచేస్తున్నాయి.

లేఖల్లోనే మాట్లాడుకునేవాళ్లం..



- రామ్మూర్తి, విశ్రాంత జైలర్, శివనగర్ (వరంగల్)

నేను 1985 నుంచి తొమ్మిదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా (ప్రస్తుతం వైఎస్ఆర్ జిల్లా) ప్రొద్దుటూరు సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేశాను. నా భార్య సత్యవతి వరంగల్‌లో ఉండేది. ఆమెకు నాలుగు రోజులకు ఒక లేఖ రాసేవాడిని. ఆమె యోగక్షేమాలు, పిల్లలు ఎలా చదువుతున్నారు, వారి ఆరోగ్యం ఎలా ఉందంటూ.. ఉత్తరాల ద్వారా అడిగేవాన్ని. ఆమె రాసిన ఉత్తరం చదువుతుంటే ఆమె మాట్లాడుతున్నట్లే అనుభూతి పొందేవాడిని. టెలికాం రంగం ఎంత అభివృద్ధి చెందినా భావవ్యక్తీకరణ, మనసును కదిలించడం ఉత్తరానికే దక్కుతుంది..

పథకాలపై విస్తృత ప్రచారం



తపాలా పథకాలు, సేవలపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రధాన గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) సేవలను ఎక్కువగా ఉపయోగించుకునేలా డిజిటల్ సేవలను విస్తృతం చేశాం.

- రవికుమార్, సూపరింటెండెంట్, వరంగల్

చదువుల తల్లిగా భద్రకాళి!



రంగంపేట(వరంగల్), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం వరంగల్ జిల్లాలోని భద్రకాళి అమ్మవారు సరస్వతీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. లలిత పంచమి పర్వదినం కావడంతో అమ్మ సన్నిధిలో పిల్లలతో అక్షరాలు దిద్దించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి రథసేవ నిర్వహించారు. శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. చదువుల తల్లిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

● 'మహాష్టమి(దుర్గాష్టమి) రోజున కోటి యోగిని గణములతో శ్రీభద్రకాళి అమ్మవారి జన్మించారు. అందుకే మహాష్టమి పర్వదినాన సద్దుల బతుకమ్మ ఆడతారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని' ఈవో శేషుభారతి తెలిపారు.

పీహెచ్‌డీ ప్రవేశాలపై సద్దుమణగని ఆందోళన



రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారును అడ్డుకుంటున్న విద్యార్థులు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం విద్యార్థులు చేస్తున్న ఆందోళన సద్దుమణగడం లేదు. బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టిన విద్యార్థులు పీహెచ్‌డీ- 2022 కేటగిరి-2 రెండో జాబితాలో ప్రవేశాలు కల్పించాలని రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారుకు అడ్డంగా బైఠాయించారు. తమకు ప్రవేశాలు కల్పించే వరకు వెళ్లనిచ్చేది లేదని భీష్మించడంతో కేయూ ఠాణా ఎస్ఐ రాజ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి వారిని నిలువరించారు. విషయాన్ని ఇన్‌ఛార్జి ఉప కులపతి వాకాటి కరుణకు వివరించి, న్యాయం జరిగేలా చూస్తానని రిజిస్ట్రార్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో మంద నరేష్, రాకేష్, మనోహర్, తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

దేశాలు దాటి వెళ్లి.. మృతదేహమై తిరిగొచ్చి!



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఉగాండాలో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్న జనగామకు చెందిన ఇటికాల తిరుమలేశ్ తాను పని చేసే కంపెనీలోనే సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో ఉగాండా నుంచి ఐదు రోజులకు బుధవారం తిరుమలేశ్ మృతదేహం జనగామ పట్టణం గిర్నిగడ్డలోని స్వగృహానికి మధ్యాహ్నం 1 గంటకు చేరుకుంది. తిరుమలేశ్ మృతదేహంతో పాటు ఆయన భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండా నుంచి వచ్చారు. జనగామలో ఉన్న మృతుడి తల్లి కిష్టమ్మ, సోదరుడు చిన్నా, చెల్లెలు హేమలతతో పాటు కుమార్తె అఖిల ఐదు రోజులుగా మృతదేహం కోసం నిరీక్షిస్తూ కన్నీటి పర్యంతంలో మునిగిపోయారు. 'దేశం కాని దేశం వెళ్లి... శవంగా వచ్చావా.. బిడ్డా.. నీ భార్య పిల్లలను ఆగం చేసితివా బిడ్డా..' అంటూ తల్లి కిష్టమ్మ విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పట్టణ ప్రజలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుమలేశ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పిల్లల చదువుకు అవసరమైతే బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చి, ఆర్థిక సాయం అందజేశారు. అంత్యక్రియలు పట్టణంలోని మార్కెట్ సమీప శ్మశాన వాటికలో సాయంత్రం 6గంటలకు ముగిసాయి.

నిరుపేద కుటుంబంపై దీర్ఘకాలిక జబ్బు పంజా

● గంటల వ్యవధిలో తల్లీకుమారుడు మృతి



తల్లి చిదురాల శోభతో సాయికిరణ్

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: వారికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబం. భార్య, భర్త, ఇద్దరు కుమారులు రోజూ పనిచేసుకొని జీవించేవారు. దీర్ఘకాలిక జబ్బు బారినపడిన తల్లి, కుమారుడు ఒకేరోజు గంటల వ్యవధిలో మృతి చెందారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు గ్రామానికి చెందిన చిదురాల లక్ష్మణ్ తాపీమేస్త్రీగా, భార్య శోభ (53) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. శోభకు రెండేళ్ల కిందట బోన్ టీబీ సోకగా.. గ్రామంలోనే మోటార్ మెకానిక్ పని చేస్తున్న చిన్న కుమారుడు సాయికిరణ్ (25) ఏడాది కిందట నోటి క్యాన్సర్‌కు గురయ్యాడు. ఉన్నంతలో ఆసుపత్రులకు తిరిగి ఖర్చు చేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. మంచానికే పరిమితమైన తల్లి బుధవారం ఉదయం మృతి చెందగా.. రెండు గంటల వ్యవధిలో కుమారుడు సైతం కన్నుమూశాడు. బతుకమ్మ, శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఒకే ఇంట్లో ఇద్దరి మృతి ఆ కుటుంబం, గ్రామంలో విషాదం నింపింది. అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామస్థులే విరాళాలు వేసుకొని ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

ధరణి దరఖాస్తుల్లో జాప్యం తగదు


బచ్చన్నపేటలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా పాలనాధికారి రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం బచ్చన్నపేట తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి ఆవరణ పరిశీలించి, శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ధరణి స్లాట్‌లను పెండింగ్‌లో ఉంచరాదని, వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కొమురయ్య, ఎమ్మార్వో మహిపాల్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ ఫణికిశోర్, తదితరులున్నారు.

నిజాయతీ చాటిన ఆటో చోదకుడు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: తన ఆటోలో ఓ మహిళ మరిచిపోయిన బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును ఓ డ్రైవర్ తిరిగి అప్పగించి నిజాయతీ చాటుకున్న సంఘటన జనగామలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ దామోదర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి జనగామకు వచ్చిన కరకంచి మాధవి, అక్కడి నుంచి తన పుట్టిల్లయిన పసరమడ్లకు వెళ్లడానికి ఆటోను మాట్లాడుకున్నారు. అయితే ఆమె తన బ్యాగును మరిచిపోయింది. గమనించిన డ్రైవర్ మార్గం వెంకటేశ్వర్లు తిరిగి పోలీసులకు అప్పగించారు. బ్యాగులో 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేల విలువైన బట్టలున్నాయి. బుధవారం మాధవికి ఆ సంచిని సీఐ అందజేశారు. నిజాయతీ చాటుకున్న చోదకుడిని పలువురు అభినందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


సింగరాజుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం దేవాదుల కాల్వ నుంచి మండలంలోని సింగరాజుపల్లికి వస్తున్న జలాలకు ఎమ్మెల్యే స్వాగత పూజలు నిర్వహించారు. కర్షకుల పక్షపాతిగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన చేస్తున్నారని, త్వరలోనే సంక్షేమ పథకాల అమలు ప్రతి ఇంటికి అందుతాయని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నల్ల శ్రీరాం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా



జనగామ అర్బన్, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ అమలు చేయకుండా, సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ జనగామ కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. అంతకు ముందు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి కలెక్టరేట్ వరకు నల్లజెండాలు పట్టుకొని, ముఖ్యమంత్రికి వ్యతిరేక నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాగల్ల ఉపేందర్, జిల్లా అధ్యక్షుడు జి.కిశోర్, రాష్ట్ర నాయకుడు కొయ్యడ మల్లేశ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చేంత వరకు ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పైసా రాజశేఖర్, ఇటికాల ప్రసాద్, సందెన రవీందర్, గడ్డం సోమరాజ్, నీర్మాల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో బతుకమ్మ సందడి



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ ఆర్టీసీ బస్ డిపోలో బుధవారం ఆర్టీసీ డీఎం స్వాతి ఆధ్వర్యంలో మహిళా సిబ్బంది బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఉయ్యాల పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు యాకయ్య, సమ్మయ్య, సూపరింటెండెంట్ యాదమణిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నియామకాలు హర్షణీయం


ప్రసంగిస్తున్న రంజిత్‌కుమార్

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చాలా తక్కువ సమయంలో డీఎస్సీ నిర్వహణ, ఫలితాల ప్రకటన, నియామకాలు చేపట్టడం హర్షణీయమని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన టీఎస్‌యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. డీఎస్సీ నియామకాలతో విద్యారంగానికి మంచి పరిణామమన్నారు. అదేవిధంగా ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్, కోశాధికారి సుధాకర్, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కనకారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కుందారంలో ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరికీ షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని తెలిపారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలని, ధరణి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మండల కార్యదర్శి కరుణాకర్, నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం


విద్యాపరిరక్షణ కమిటీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం నాయకులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విద్యా రంగం నీరుగారిందని, వాటిని కాపాడుకోవాలని విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఇప్ప రాంరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో విద్యాపరిరక్షణ కమిటీ కరపత్రాన్ని ఆ కమిటీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పాలకుల పదేళ్ల పరిపాలనలోనే పాఠశాలలు మూసివేతకు గురయ్యాయని, వాటిని పట్టించుకోకుండా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు పూనుకోవడం సరికాదన్నారు. నాయకులు డి.శ్రీనివాస్, రాజు, చొక్కయ్య, నాగేందర్, అంకుశావలి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన డీఎస్సీ విజేతలు


జెండా ఊపి అభ్యర్థులను హైదరాబాద్‌కు తరలిస్తున్న డీఈవో రాము

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: డీఎస్సీలో ఉద్యోగాలకు ఎంపికైన విజేతలు బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎల్బీ స్టేడియంకు తరలివెళ్లారు. జిల్లా నుంచి ఎంపికైన 199 మంది విజేతలు, వారి కుటుంబీకులను ప్రత్యేక బస్సుల్లో విద్యాశాఖాధికారులు తీసుకెళ్లారు. వారికి ఏర్పాటు చేసిన బస్సులను జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము జెండా ఊపి తరలించారు. పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీధర్, జీసీడీవో గౌసియాబేగం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కెట్లకు సెలవులు

జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్: బతుకమ్మ, దసరా పండగలను పురస్కరించుకుని ఈ నెల 10 నుంచి 13 వరకు జనగామ, స్టే.ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్లకు సెలవులు ప్రకటించారు. 10న దుర్గాష్టమి బతుకమ్మ, 11న మహార్నవమి, 12న దసరా, 13న ఆదివారం సాధారణ సెలవు కారణంగా మార్కెట్లో క్రయ, విక్రయాలు ఉండబోవని మార్కెట్ కార్యదర్శులు బుధవారం ప్రకటనలో తెలిపారు.

పండగ వేళ.. కిక్కిరిసిన జనం


పట్టణంలో పూలను కొనుగోలు చేస్తున్న మహిళలు

సద్దుల బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో జనగామ పట్టణం బుధవారం వేలాది మంది జనంతో కిక్కిరిసిపోయింది. పూల విక్రయాలు, వస్త్ర, కిరాణా దుకాణాల్లో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఇసుక వేస్తే రాలనంత జనంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. – న్యూస్‌టుడే, జనగామ టౌన్


జనగామ చిన్నగేటు ప్రాంతంలో..


సిద్దిపేట రోడ్డు వైపు వాహనాల రద్దీ


వంతెనపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహనదారులు

ఆదమరిస్తే.. ప్రమాదమే!

పాలకుర్తి-జనగామ ప్రధాన రహదారి పటేలుగూడెం సమీపంలో నవాబుపేట వాగుపై నిర్మిస్తున్న వంతెనపై నుంచి తాత్కాలిక రోడ్డుతో కలుపుతూ వాహనాలను దారి మళ్లించారు. అడ్డుగా సిమెంట్ దిమ్మెలు, గోడ నిర్మాణం చేపట్టలేదు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, లింగాలఘనపురం

చికిత్స పొందుతూ ఒకరి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కత్తుల రాజు (29) ఆర్థిక ఇబ్బందులతో సోమవారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై సీఐ వేణును వివరణ కోరగా కేసు నమోదు కాలేదని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జఫర్‌గఢ్: మండలానికి చెందిన హబీబ్‌ఖాన్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు టాటా ఏస్ వాహనం ద్వారా 35 క్వింటాళ్లు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై బానోతు రామ్‌చరణ్ తెలిపారు.

బీమా చెక్కు అందజేత

జనగామ టౌన్: జనగామ పట్టణానికి చెందిన భారాస సీనియర్ కార్యకర్త మహ్మద్ ఖైసర్ పాషా ఈ ఏడాది జూన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. భారాస పార్టీ తరపున మంజూరైన బీమా సొమ్ము రూ.2లక్షల చెక్కును బుధవారం జనగామలోని తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.జమున, కౌన్సిలర్లు ప్రేమలతారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ వద్ద ఆర్టీసీ సిబ్బంది నియామకం



రఘునాథపల్లి, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా పండుగలకు వెళ్తున్న ప్రయాణికులను సాఫీగా గమ్యస్థానాలకు చేర్చడానికి ఆర్టీసీ చర్యలు చేపట్టింది. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిలో రఘునాథపల్లి మండలం కోమాళ్ల టోల్‌గేట్ వద్ద ఆర్టీసీ యంత్రాంగం సిబ్బందిని నియమించింది. బుధవారం సిబ్బంది విధులకు హాజరయ్యారు. టోల్‌గేట్ వద్ద బస్సులు నిలిచిపోకుండా చూడడంతోపాటు ఈ ప్రాంతంలో మొరాయించే బస్సుల సమాచారం, ప్రత్యామ్నాయ ఏర్పాట్ల బాధ్యతను అధికారులు తమకు అప్పగించారని ఆర్టీసీ కానిస్టేబుళ్లు, సిబ్బంది నవీన్, రాజు, భిక్షపతి తెలిపారు.